క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. చరిత్ర, గణితం, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ అధ్యాపకుల పోస్టులు మూడు చొప్పున, పొలిటికల్ సైన్స్, కామర్స్, బీబీఏ రెండేసి పోస్టులతో పాటు ఇంగ్లిష్, ఎకనామిక్స్, బీసీఏ, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, బాటనీ ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా అన్ని సర్టిఫికెట్ల జిరాక్సులతో కళాశాల కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. జనరల్, బీసీ అభ్యర్థులైతే సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఈ నెల 11న ఉదయం ఇంటర్వ్యూ, డెమో ఉంటాయని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

108లో ప్రసవం

ఖమ్మంవైద్యవిభాగం: 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తున్న గర్భిణికి నొప్పులు పెరగడంతో సిబ్బంది ప్రసవం చేశారు. రఘునాథపాలెం మండలం కొత్తూరు కు చెందిన ఎం.అఖిలకు పురిటి నొప్పులు వస్తుండటంతో ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. దీంతో పైలట్ సీతారాంబాబు, ఈఎంటీ తల్లాడ రేణుక అక్కడకు వెళ్లి అఖిలను పెద్దాస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లోకి ఎక్కిస్తుండగా నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఆమెకు ఈఎంటీ ప్రసవం చేయగా సాధారణ కాన్పు ద్వారా ఆడబిడ్డ పుట్టింది. బాలింత, శిశువుకు ప్రథమ చికిత్స చేసి ఖమ్మం ఎంసీహెచ్‌కు తరలించారు. సిబ్బందిని 108 ఎగ్జిక్యూటివ్ మేనేజర్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ అభినందించారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళలపై జరుగుతున్న హింసాత్మక సంఘటనలుతీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని, వెంటనే వాటిని అరికట్టాలని జమాతె ఇస్లామి హింద్ ఖమ్మం ఇంద్రానగర్ అధ్యక్షురాలు హుస్నైన్‌బీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 1 నుంచి 30 వరకు దేశవ్యాప్త జాగృతి ఉద్యమంలో భాగంగా ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన మహిళా విద్యావేత్తల సింపోజియంలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యక్షురాలు ఆరిఫా జహెరా, సోషల్ వర్కర్ నాగమణి, సుశీల, రజిని, నవ్య, ఉమా, ఫాతిమా జబీన్, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కామేపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం మండలంలోని కొత్తలింగాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి ఎమ్మెల్యేను శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మలపాటి సత్యనారాయణ, ఆరెం రవి, సరిరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన గుడిసె గోడ..

నేలకొండపల్లి: వరుస వర్షాలతో గుడిసె తడిసి గోడలు కుప్పకూలగా, ఆ సమయాన నిద్రిస్తున్న వృద్ధురాలు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. మండలంలోని మోటాపురం గ్రామంలో అరవై ఏళ్ల గుగులోత్ లక్ష్మి, ఆమె కుమారుడు వీరబాబు నివసిస్తున్న పూరి గుడిసె గోడలు శనివారం అర్ధరాత్రి కూలాయి. దీంతో వారు ఉలిక్కిపడి నిద్ర లేచి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో తలదాచుకున్నారు. కాగా, ప్రమాదకరంగా మారిన గుడిసె నుంచి వారిని పునరావాస కేంద్రానికి తరలించడంతో ఉద్యోగులు నిర్లక్ష్యం వ్యవహరించారని స్థానికులు ఆరోపించారు. ఇకనైనా లక్ష్మి కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

వరద నీరు తొలగించండి


తహసీల్దార్‌ను వేడుకుంటున్న మహిళ

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామంలో డ్రెయిన్లు సక్రమంగా లేక ఏ చిన్న వర్షం పడినా వరద నీరు తమ ఇళ్లల్లోకి కంటిమీద కునుకు లేకుండా చేస్తుందని గ్రామానికి చెందిన వరద ముంపు బాధితురాలు తహసీల్దార్ లూదర్ విల్సన్‌ను వేడుకుంది. దీంతో గ్రామ ప్రత్యేక అధికారి, కార్యదర్శిలతో మాట్లాడి.. జేసీబీ ద్వారా నీళ్లు పోయేలా చర్యలు చేపట్టారు.

పరిహారం ఇవ్వాలి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ యాఖుబ్–సైదాబీ వరదల్లో మృతిచెందగా.. రూ. కోటి పరిహారంతో పాటు కుమారులకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని మాస్‌లైన్ ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, శివలింగం, వెంకటేశ్వర్లు, మల్లయ్య, గురువారెడ్డి పాల్గొన్నారు.

వణికిస్తున్న వరద..


వరద నీటిలో పర్యటిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ

మున్నేరు ప్రాంతవాసులకు పొంచి ఉన్న వరద గండం

- ముంపు ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- సహాయక చర్యల్లో నిమగ్నమైన యంత్రాంగం
- ఇళ్లల్లో ఉండొద్దని హెచ్చరికలు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు వరద భయంతో బెంబేలెత్తుతున్నారు. గత నెల 31వ తేదీ అర్ధరాత్రి తర్వాత వచ్చిన వరదలతో సర్వస్వం కోల్పోయిన బాధితులను మరోసారి వరద ముప్పు పొంచి ఉందని ప్రభుత్వ యంత్రాంగం జారీ చేస్తున్న హెచ్చరికలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. తగ్గినట్లే తగ్గిన మున్నేరు శనివారం రాత్రి నుంచి మళ్లీ పెరుగుతుండడంతో ఇప్పుడిప్పుడే ఇళ్లకు చేరుకొని శుభ్రం చేసుకుంటున్న కాలనీ వాసులు మళ్లీ పెట్టిబేడా సర్దుకొని పునరావాస కేంద్రాల బాట పట్టాల్సి వచ్చింది. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 7.30 గంటల వరకు 15 అడుగుల నుంచి 15.75 అడుగుల మేర వరద ప్రవాహం కొనసాగింది.

అప్రమత్తమైన అధికారులు..

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులందరిని అప్రమత్తం చేశారు. కార్పొరేషన్ సిబ్బంది, పోలీసులు ముంపు ప్రాంతాల వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించడంతో పాటు ముంపు ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను సైతం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్, కేఎంసీ కమిషనర్ ముంపు ప్రాంతాల్లోకి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. 1,300 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

రాత్రికి రాత్రి ఖాళీ..

భారీ వర్షాలతో ఈ నెల 1న మున్నేరుకు 36.9 అడుగుల మేర వరద రాగా.. పదుల సంఖ్యలో కాలనీలు నీట మునిగాయి. బాధితులు ఇళ్లు ఖాళీ చేసే సమయం కూడా లేకపోవడంతో వందలాది మంది భవనాలపైకి ఎక్కి వరద తగ్గేవరకూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడిపారు. ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడంతో మున్నేరుకు మరోసారి వరద పోటెత్తింది. శనివారం ఉదయం 8.25 అడుగుల మేర వరద ఉండగా.. రాత్రి 8.30 గంటలకు 9.50 అడుగులకు, 9.30 గంటలకు 10 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు ముంపు ప్రాంతవాసుతలను ఆ రోజు రాత్రే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు.

అర్ధరాత్రి ఖాళీ చేయమన్నారు..



రాత్రి 7.30 గంటల సమయాన వరద వస్తుందని అధికారులు చెప్పగా.. అర్ధరాత్రి 12 గంటలకు ఇళ్లను ఖాళీ చేయమన్నారు. దాతలు ఇచ్చిన బట్టలు కూడా ఇంట్లోనే వదిలేసి.. కట్టుబట్టలతోనే అర్ధరాత్రి పునరావాస కేంద్రాలకు వెళ్లాం. ఆ సమయాన వాహనాలు లేక కొత్త బస్టాండ్‌కు వెళ్లాం.

– పిడుగు రమణ, కరుణగిరి

పునరావాస కేంద్రానికి వెళ్లాం..



వరద వస్తుందని.. సర్దుకొని వెళ్లండని అధికారులు చెప్పారు. దీంతో మళ్లీ ఎక్కడ మునిగిపోతామోనని మహిళ కళాశాలలోని పునరావాస కేంద్రానికి వెళ్లాం. రాత్రి వేళ వచ్చి సర్దుకోమంటున్నారు. సర్దుకోవడానికి ఏమి మిగిలి లేక కట్టుబట్టలతోనే వెళ్లాం.

– శతకోటి పద్మ, బొక్కలగడ్డ

వరద బాధితులకు అండగా..

- ఖమ్మం రూరల్: మండలంలోని కస్నాతండా, ఆకేరు వరద ముంపునకు గురైన ప్రాంతాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం సందర్శించి, వారి గోడును తెలుసుకున్నారు. అనంతరం సీపీఐ ఆధ్వర్యాన దుప్పట్లు, 5 కేజీల బియ్యం, వంట నూనె, దుస్తులు పంపిణీ చేసి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సంయుక్త ఆధ్వర్యాన అందిస్తున్న నిత్యావసరాలను తీర్థాల గ్రామంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పంపిణీ చేసి మున్నేరు వరద ఉధృతిని పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని రాజీవ్‌గృహకల్ప మున్నేరు వరద బాధితులకు హైదరాబాద్‌కు చెందిన హెల్పింగ్ హ్యాండ్, వేములూరి ఫౌండేషన్ ఆధ్వర్యాన దుప్పట్లు, చీరలు, దోమతెరలు, టవళ్లు కలిగిన కిట్లను పంపిణీ చేశారు. అంతేకాక పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏదులాపురంలో భోజనం, తాగునీరు అందించారు.
- నేలకొండపల్లి: మున్నేరు వరద బాధితులకు చిరాగ్ ఫౌండేషన్, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిల సంయుక్తంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.
- ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న మున్నేరు వరద బాధిత కార్మిక కుటుంబాలకు మార్కెట్ కార్మిక సంఘం ఆధ్వర్యాన 25 కిలోల బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేశారు.
- ఖమ్మం మామిళ్లగూడెం: మున్నేరుతో వరద బాధితులకు మాల మహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యాన అన్నదానం చేశారు. అలాగే డాక్టర్స్ అసోసియేషన్ ఫర్ రిలీఫ్ అండ్ ఎడ్యుకేషన్ ఖమ్మం శాఖ ఆధ్వర్యాన వెంకటేశ్వరనగర్, జలగంనగర్ బాధితులకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు, చాపలు, దుప్పట్లు పంపిణీ చేసింది. అలాగే వరద ముంపునకు గురైన దానవాయిగూడెం పద్మశాలి కుల బాంధవులకు జిల్లా, రాష్ట్ర అభ్యుదయ పద్మశాలి సంఘాల ఆధ్వర్యాన ఆహార దినుసులు, దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద బాధితులకు స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన 50 కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు.
- ఖమ్మంఅర్బన్: వరద ముంపు ప్రాంతాలైన కవిరాజ్‌నగర్, ధంసలాపురం, దానవాయిగూడెం, జలగంనగర్, నాయుడుపేట, సారథినగర్ తదితర ప్రాంతాల్లో సుమారు వెయ్యి మంది బాధితులకు టెక్నోన్ ఇన్ఫోటెక్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులు ఒక్కో కుటుంబానికి 5 కేజీ బియ్యం, కేజీ కందిపప్పు, ఇతర నిత్యావసరాలు అందించారు.

కార్పొరేటర్ భర్త ఔదార్యం..



మున్నేరు వరదతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ భర్త రామారావు ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఈనెల 1నుంచి ఎనిమిది రోజులుగా రోజుకు 3వేల మంది బాధితులకు అన్నదానం చేయడంతోపాటు తాగునీరు కూడా సమకూరుస్తున్నారు. మంచికంటినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, సాయిగణేష్‌నగర్‌ల్లో అన్నదానం చేస్తుండగా స్థానికులు ఆయనను అభినందిస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

జోరు వానలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులు


పడవ సాయంతో వెళ్తున్న సిబ్బంది

నేలకొండపల్లి: ఇటీవల వచ్చిన వరదలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని శాంతినగర్, నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి, బుద్ధారం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్లు తెగి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గత రెండు రోజులుగా కూసుమంచి ఏడీ కోక్యానాయక్, నేలకొండపల్లి ఏఈ కె.రామారావులు విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈక్రమంలో ఆదివారం గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచి జోరు వానలోనూ విద్యుత్ సిబ్బంది పడవ సాయంతో ఏటిలో పడి ఉన్న విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో..

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రోడ్డుపై జుజుల్‌రావుపేట సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పాలేరు గ్రామానికి చెందిన శీలం వెంకటనారాయణ, ఎలిశెట్టి వినోద్‌లు ఆదివారం ఖమ్మం నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో వెంకటనారాయణ, వినోద్‌లకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మంచికంటి హాల్‌లో పేదల కోసం సీపీఎం టూటౌన్ కమిటీ–బీవీకే ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రమేష్ కళ్యాణపు, శశాంక, సి.భారవి, పి.సుబ్బారావు, జి.రాజేష్, జెట్ల రంగారావులు బాధితులకు వైద్య పరీక్షలు చేసి కావాల్సిన మందులు అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్‌తో పాటు కె.సాగర్‌రెడ్డి, వాసిరెడ్డి దయానంద్, వై.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, బోడపట్ల సుదర్శన్, పి.ఝాన్సీ పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో..

నేలకొండపల్లి: మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 149 మందికి వైద్య సేవలందించారు. కమిటీ ప్రతినిధులు ఏటుకూరి రామారావు, కె.వి.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, జమాల్, మంకెనపల్లి నరసింహారావు, కోదండ రామారావు, కొండలరావు, సూర్యానారాయణరావు, బాబు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లి, రామచంద్రాపురం, కట్టుకాచారం గ్రామాల్లో ఆదివారం జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, తహసీల్దార్ ఇమ్రాన్‌లు పర్యటించి ఏటి ఉధృతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ, బోదులబండ వైద్యాధికారి గీత, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే ముంపు గ్రామాలను పరిశీలించిన ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివలు మండల పరిషత్ కార్యాలయాలలో బస చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

రక్తదాన శిబిరం

ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం: విద్యుత్ పోరాట ఉద్యమంలో అశువులు బాసిన సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతిని మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని ఇందిరానగర్‌లో సీపీఎం హవేలి ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి శ్రీను, నాయకులు బుగ్గవీటి సరళ, మందడపు సాయిబాబు, హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు, వై.విక్రమ్, గుడ్ల వెంకటేశ్వర్లు, రమ్య, కాంపాటి బాబురావు, రాము, సురేష్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూత


మాట్లాడుతున్న చైర్మన్ ఎర్నేని రామారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎంతోమంది పేదలకు స్తంభాద్రి బ్యాంక్ చేయూతనిస్తుందని బ్యాంక్ చైర్మన్ ఎర్నేని రామారావు అన్నారు. ఆదివారం జరిగిన స్తంభాద్రి బ్యాంక్ 25 వార్షిక సర్వసభ్య సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర బ్యాంకుల కన్నా అత్యధిక వడ్డీ, సీనియర్ సిటిజెన్స్‌కు తమ బ్యాంక్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వసంతకుమార్‌పటేల్, డైరెక్టర్లు షేక్ హుస్సైన్, భద్రయ్య, మల్లికార్జునరావు, నాగేశ్వరరావు, కవిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు షురూ..

- నాలాలపై నిర్మాణాల తొలగింపునకు చర్యలు
- జేసీబీలతో నాలాలను శుభ్రం చేయిస్తున్న యంత్రాంగం


జేసీబీతో ఫ్యాక్టరీని కూల్చేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని నాలాలు, డ్రెయిన్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు కేఎంసీ అధికారులు ఉపక్రమించారు. నగరంలోని పలు చెరువుల నాలాలు, స్టోమ్ వాటర్ డ్రెయిన్లను ఆక్రమించి ఇష్టానుసారంగా వందల సంఖ్యలో భవనాలను నిర్మించారు. నాలాలపై, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం, కొంతమంది కాసులకు కక్కుర్తిపడి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో నగరంలో అడ్డగోలుగా నిర్మాణాలు వెలిశాయి. చెరువుల నాలలను పూడ్చి మరీ నిర్మాణాలను చేపట్టారు. కొంత మంది రాజకీయ నాయకులు ఆక్రమణదారులకు అండగా నిలవడంతో యథేచ్ఛగా ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వచ్చిన వరదలతో నగరం నడిబొడ్డున ఇళ్లు మునగడంతో ఆక్రమణలపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది. కొంత మంది చేపట్టిన అక్రమ నిర్మాణాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని బాధితులు ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని, నాలాలపై ఆక్రమణలను తొలగించాలనే డిమాండ్ పెరిగింది.

ఆక్రమణల గుర్తింపు..?

నగరంలో నాలాలు, డ్రెయిన్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను అధికారులు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కొద్దిపాటి వర్షం వచ్చినా చైతన్యనగర్, కవిరాజ్‌నగర్, సీక్వెల్ ప్రాంతం, జెడ్పీ వెనుక ప్రాంతాల్లోని రోడ్లపైకి, ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎప్పుడు చూడని వరద నీరు తమ ఇళ్లపైకి రావడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణల వలన జరిగే భవిష్యత్ నష్టాలను దృష్టిలో ఉంచుకొని వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. లకారం చెరువుకు వెళ్లే నాలాలను పరిశీలించి, ఆక్రమణలను గుర్తిస్తున్నారు. ఆదివారం టౌన్‌ప్లానింగ్ అధికారులు వీటిపై దృష్టిసారించారు.

కూల్చివేతకు చర్యలు..

నాలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కవిరాజ్‌నగర్‌లో నాగార్జున ఫంక్షన్‌హాల్ వద్ద నిర్మించిన ఓ ఐస్ ఫ్యాక్టరీ నాలాను ఆక్రమించి నిర్మించినట్లు అధికారులు భావించి, యజమానికి ఫోన్ చేయగా స్పందించపోవడంతో జేసీబీ ద్వారా తొలగింపు పనులు ప్రారంభించారు. కాగా, ఐస్ ఫ్యాక్టరీ మిషనరీలో అమ్మోనియా గ్యాస్ ఉన్నట్లు గుర్తించి కూల్చివేతను నిలిపివేసి ఓ ప్రత్యేక టెక్నీషియన్ ద్వారా గ్యాస్‌ను తొలగించే పనులు చేపట్టారు. ఇందుకు దాదాపు 10 గంటలకు పైగా సమయం పడుతుందనడంతో సోమవారానికి వాయిదా వేశారు. నాలాలపై అక్రమంగా నిర్మించిన వాటిని తొలగించి, కాల్వలను వెడల్పు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కాల్వల్లో సిల్ట్, పూడిక తొలగింపు..

నగరంలోని లకారం చెరువు ప్రాంతంలో కాల్వల్లో పేరుకున్న సిల్ట్, వ్యర్థాలు, పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగిస్తున్నారు. కాల్వల్లో వ్యర్థాలు చేరి పూడికపోవడం, మొక్కలతో వరద నీరు పోయే పరిస్థితి లేకపోవడంతో ఖానాపురం ఊర చెరువు నుంచి వచ్చే వరద నీరు పలు కాలనీల్లోకి చేరుతుంది. దీంతో అధికారులు అప్రమత్తమై కాల్వలను శుభ్రం చేయిస్తున్నారు. వరద నీటిలోనూ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు.

గం గం గణపతి



విఘ్నాలు తొలగించే వినాయక నవరాత్రోత్సవాలను శనివారం భక్తులు కన్నుల పండువగా ప్రారంభించారు. గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన వాడవాడలా కొలువైన మండపాల్లో గణనాథున్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ఇళ్లల్లో సైతం మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజించారు. కాగా, మున్నేరు వరద పరీవాహక ప్రాంతాలు మాత్రం ఉత్సవాలకు దూరమయ్యాయి.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంక్రైం: పోలీస్ క్వార్టర్స్‌లో జరిగిన పూజలో పాల్గొన్న సీపీ సునీల్‌దత్, తదితరులు


కామేపల్లి: గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


ఖమ్మంగాంధీచౌక్: శ్రీనివాసనగర్‌లో..


తిరుమలాయపాలెం: పిండిప్రోలులో పూజలు చేస్తున్న భక్తులు


కూసుమంచి: జీళ్లచెరువులో నిర్వహించిన పూజలో పాల్గొన్న భక్తులు


నేలకొండపల్లి: రాయగూడెంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఖమ్మంరూరల్: ఓ అపార్ట్‌మెంట్‌లో పూజల్లో పాల్గొన్న జానీమియా, షాబీదా దంపతులు

వరద బాధితులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం: ఆకేరు వరదలో సర్వం కోల్పోయిన రాకాసితండా ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని రాకాసితండా వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డిలకు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన వినతి పత్రాలు అందజేశారు. పంట నష్టపోయిన రైతులకు ఆహార పంటలకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆకేరు నదిపై నిర్మించిన సీతారాం ప్రాజెక్టు అక్వాటెక్ట్‌ను తక్షణమే తొలగించాలని, రాళ్లు, ఇసుక మేటలు వేసిన పంట పొలాలకు ఎకరాకు రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా నాయకులు రేపాకుల శివలింగం, మళ్లీది నాగేశ్వరరావు, కమ్మ కోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, మారుతి మల్లయ్య, పోలే పొంగు ఉప్పలయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం..

ఖమ్మం మామిళ్లగూడెం: ముంపు ప్రాంతాల సందర్శనకు ఖమ్మం వచ్చిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగారపు కిషన్‌రెడ్డికి బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో దిగిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు గెంటెల విద్యాసాగర్, సన్నె ఉదయ్‌ప్రతాప్ తదితరులు కలిసి సాదరంగా ఆహ్వానించారు.

కవిరాజ్‌నగర్‌లో మళ్లీ వరద..

- ముంపు నుంచి కాపాడాలని స్థానికుల ధర్నా
- పోలీసులు నచ్చచెప్పినా ససేమిరా.. పరిశీలించిన మేయర్, కమిషనర్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10, 11వ డివిజన్లలో అలుగు వాగు వరద శనివారం అర్ధరాత్రి మళ్లీ ముంచింది. దీంతో కవిరాజ్‌నగర్ వాసులు ఖమ్మం–వైరా రోడ్డులో వాగు వంతెన వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఖానాపురం అలుగు వాగు నుంచి వచ్చే వరద లకారం చెరువులోకి సులువుగా పోకుండా వాగు, చెరువును పలువురు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. గంటకు పైగా ఆందోళన కొనసాగడంతో పోలీసులు చేరుకుని కమిషనర్, మేయర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి కార్పొరేటర్లు సరిపూడి రమా సతీష్, చావా మాధురి నారాయణరావుతో కలిసి పర్యటించారు. అనంతరం జేసీబీలను తెప్పించి ఆక్రమణల తొలగింపు మొదలుపెట్టారు. అయితే, పలువురు తమవి పట్టా ప్లాట్లు ఉన్నాయని పత్రాలతో రావడంతో స్థానికులు వారితో వాగ్వాదానికి దిగారు.


ధర్నా చేస్తున్న కవిరాజ్‌నగర్ నివాసులు